క్లుప్తంగా

గోడ గడియారాలు అందజేత



ఆర్‌టీసీ కాంప్లెక్స్‌కు గడియారం అందజేస్తున్న సిబ్బంది

బాలాజీచెరువు: ప్రముఖ బంగారు దుకాణం లలిత గోల్డ్ జ్యూయలర్స్ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా బిగ్ వాల్ గడియారాలు సోమవారం అందజేశారు. ప్రముఖ హిందూ దేవాలయలతో పాటు, చర్చి, మసీదు, ఆర్‌టీసీ కాంప్లెక్స్, బహిరంగ ప్రదేశాల్లో దాదాపు 500 గడియారాలు సంస్థ అధినేత కిరణ్ అందజేశారని షోరూమ్ మేనేజర్ సంతోష్ తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కరప: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ ఎం.అనుపమ తెలిపారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరై తమ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరవ్వాలని కోరారు.

పచ్చదనంతోనే ఆరోగ్యకర సమాజం



రాయుడుపాలెంలో మొక్కలు నాటుతున్న వెంకటేశ్వరరావు

కాకినాడ రూరల్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని రిటైర్డ్ ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. రమణయ్యపేట గ్రామం రాయుడుపాలెంలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేశ్వరరావు మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. భావి తరాలకు ఆక్సిజన్ కొరత లేకుండా మొక్కలు కాపాడతాయన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, ప్రసాదనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి విరాళం



చెక్కును కలెక్టర్‌కు అందజేస్తున్న విద్యార్థులు

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లా సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో స్టూడెంట్ యాక్టీవిటీ కౌన్సిల్ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా సేకరించిన రూ.21,300 చెక్కును సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌కు విద్యార్థులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ షణ్మోహన్ విద్యార్థులను అభినందించారు.

నిరుపేద విద్యార్థికి ఆర్థిక చేయూత



విద్యార్థికి చెక్కు అందిస్తున్న తలాటం హరీష్

బోట్‌క్లబ్: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రౌండ్ బాయ్‌గా పని చేస్తున్న శ్రీను కుమారుడు కార్తీక్ ఆదిత్య కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కుమారుడు కార్తీక్ ఫీజు కట్టేందుకు శ్రీను ఇబ్బందులు పడుతున్న విషయాన్ని పీఆర్ కళాశాల గ్రౌండ్ యూజర్స్ అసోసియేషన్ సెక్రటరీ తలాటం హరీష్‌కు తెలిపారు. వెంటనే ఆయన స్పందించి రూ.18 వేలు ఫీజు చెల్లించేందుకు ముందుకు వచ్చి సోమవారం చెక్కును స్పోర్ట్స్ కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో పీఆర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ రమణ పాల్గొన్నారు.

అన్నదాతకు తుఫాన్ గండం..!

అన్నదాతకు మరో తుఫాన్ గండం కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. తాజాగా వాతావరణ శాఖ చేస్తున్న హెచ్చరికలు కర్షకులకు ఆందోళనకు గురి చేస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం అల్పపీడనంగా మారి మంగళవారం నుంచి మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో వరి చేలకు మరో గండం పొంచి ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

- భారీ వర్షం హెచ్చరికలతో రైతన్నల ఆందోళన
- ప్రస్తుతం పొట్ట దశలో వరిచేలు
- నవంబరు రెండో వారం నుంచి దిగుబడులకు అవకాశం
- కాకినాడ రూరల్‌లో ఎనిమిది రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు



కాకినాడ రూరల్‌లో పొట్టదశలో ఉన్న వరిచేలు

కాకినాడ రూరల్: గత నెలలో భారీ వర్షాలు, ఏలేరు వరదతో ఇప్పటికే కాకినాడ రూరల్‌లోని పలు గ్రామాలలో రైతులు నష్ట పోయారు. ఏలేరు నుంచి వచ్చిన వరద నీటితో పండూరు, తమ్మవరం, పెనుమర్తి, సర్పవరం, చీడిగ, నేమాం, తూరంగి గ్రామాలలో సుమారు 450 ఎకరాలలో వరిచేలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం వరిచేలు పొట్టదశలో ఉంది. నవంబరు రెండో వారం నుంచి వరి చేలు కోత దశకు చేరుకుంటాయని అంచనా వేస్తున్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు మండలంలో 8 గ్రామాలలో రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

నియోజవర్గంలో కాకినాడ రూరల్, కరప మండలాలలో సుమారు 19,100 ఎకరాలలో వరి సాగవుతోంది. గోదావరి ఆయకట్టులో ముందుగానే నాట్లు వేశారు. ఏలేరు కింద ఆలస్యంగా నాట్లు చేశారు. ఈ సీజన్‌లో ఎక్కువ మంది రైతులు ఎంటీయూ 7029(స్వర్ణ) రకం వరి వంగడం సాగు చేపట్టగా పది శాతం మంది బీపీటీ 5204, మరో పది శాతం మంది ఎంటీయూ 1318 రకం, 20 శాతం ప్రైవేటు వరి వంగడాలు సాగు చేస్తున్నారు. తుఫాన్ కారణంగా తరుచూ ముంపునకు వరిచేలు గురవ్వడంతో ఆ ప్రభావం దిగుబడిపై పడుతుందని తద్వారా తాము తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని రైతులు పేర్కొన్నారు.

నేటికీ అందని పెట్టుబడి సాయం..

వ్యవసాయం చేసే అన్నదాతలకు ఆసరాగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పీఎం కిసాన్‌తో కలిపి రూ.13,500లు పెట్టుబడి సాయంగా ఇచ్చేవారు. కౌలు రైతులకు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం అందించేది. ఏటా మే నెలలోనే పెట్టుబడి సాయం మొదటి విడత అందించి అన్నదాతలను ఆదుకునేవారు. కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఆచరణలో చూపలేదు. దీంతో విపత్తులతో అల్లాడుతున్న రైతులు అధిక పెట్టుబడులతో ఇబ్బందులు పడుతున్నారు. మేలో అందించాల్సిన పెట్టుబడి సాయం అక్టోబరు వచ్చినా ఇవ్వక పోవడంతో చంద్రబాబు ప్రభుత్వం చిత్తశుద్ధిని రైతులు ప్రశ్నిస్తున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

"ప్రస్తుతం వరి చేలు ఏపుగా పెరుగుతూ పొట్ట దశలో ఉంది. ఈ దశలో వరిచేలను కంటికి రెప్పలా కాపాడుకోవాలి. భారీ వర్షాల హెచ్చరికలు ఉన్నందున వరిచేలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. మడులలో నీరు బయటకు పోయే మార్గాలు ఏర్పాటు చేసుకోవాలి. రైతు సేవా కేంద్రాలను నేమాం, పండూరు, తమ్మవరం, సర్పవరం, రేపూరు, చీడిగ, కొవ్వూరు, తూరంగిలో ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు మద్దతు ధరను కామన్ రకం 75 కేజీల బస్తాకు రూ.1,725లు చొప్పున, సన్న రకానికి రూ.1,740లు చొప్పున ప్రకటించింది. ఏలేరు వరద సమయంలో దెబ్బ తిన్న 450 ఎకరాల పంటకు ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు జమ అయ్యాయి."

– చీకట్ల సత్యనారాయణ, వ్యవసాయ అధికారి, కాకినాడ రూరల్.

19 నుంచి పల్లె పండుగ

కరప: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 19 నుంచి నాలుగు రోజుల పాటు పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీఓ ఎం.అనుపమ సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులు వినియోగించి పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేయడం జరుగుతుందన్నారు. ఉపాధి నిధులు రూ 3.27 కోట్లతో 59 పనులు చేపడతామన్నారు. ఈ నెల 19న కరప, పెనుగుదురు, నడకుదురు, గురజనాపల్లి, ఉప్పలంక గ్రామాల్లోనూ, 20న కొరిపల్లి, జెడ్.భావారం, గొర్రిపూడి... గొడ్డటిపాలెం, వలసపాకల, వేములవాడ గ్రామాల్లోనూ, 21న వాకాడ, పెదకొత్తూరు, వేళంగి, యండమూరు, జి.భావారం, సిరిపురం గ్రామాల్లోనూ, 22న పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం, కొంగోడు, గొర్రిపూడి, పాతర్లగడ్డ గ్రామాల్లోనూ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులతో కలిసి నిర్వహిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

నేటి నుంచి పల్లె పండగ

కాకినాడ రూరల్: పల్లె పండగ – పంచాయతీ వారోత్సవాలు పేరిట కాకినాడ రూరల్ మండలంలో మంగళవారం నుంచి మూడు రోజులు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ సతీష్ తెలిపారు. నేమాం నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని మొత్తం 84 పనులకు సంబంధించి రూ.6.87 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రజా ప్రతినిధులు శంకుస్థాపనలు చేస్తారన్నారు.

తుఫానుపై అప్రమత్తంగా ఉండండి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ భావన

నగరపాలక సంస్థ కమిషనర్ భావన

కాకినాడ: తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. తుఫాను నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం మంత్రి నారాయణ మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ అల్పపీడన ప్రభావంతో ఈ నెల 14 నుంచి మూడు రోజుల పాటు కాకినాడ జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్నారు. వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో కాకినాడ నగర పరిధిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కమిషనర్ ఇంజినీరింగ్, తదితర విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. నగరంలోని లోతట్టు ప్రాంతాలపై దృష్టి సారించాలని సూచించారు. ముంపునకు గురయ్యే ప్రాంతాల వారిని అప్రమత్తం చేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి అవసరమైన ఆహారం, తాగునీరు, పాలు సరఫరా చేయాలని సూచించారు. వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా తాగునీటి సరఫరాకు ట్యాంకర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వరద నీటిని తొలగించడానికి సహాయక చర్యల కోసం జేసీబీలు, ట్రాక్టర్లను సిద్ధం చేయాలని కమిషనర్ సూచించారు. సమావేశంలో కాకినాడ నగరపాలక సంస్థకు చెందిన వివిధ విభాగాధిపతులు, ప్రత్యేక అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఎంసీలో వేడుకగా ఫ్రెషర్స్ వెల్‌కమ్ డే



విద్యార్థుల చేత చరక సపత్ చేయిస్తున్న డాక్టర్ విష్ణువర్ధన్

కాకినాడ క్రైం: 2024 బ్యాచ్‌కు చెందిన రంగరాయ వైద్య కళాశాల ఫ్రెషర్స్ బ్యాచ్‌కు ఘన స్వాగతం లభించింది. యాజమాన్యం చొరవతో 2021 బ్యాచ్ విద్యార్థులు తమ జూనియర్లకు గ్రాండ్ వెల్‌కమ్ పలికారు. కాకినాడ ఆర్‌ఎంసీలో ఉన్న ఫిజియోలజీ గ్యాలరీలో సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ ఎన్‌టీఆర్‌యూహెచ్‌ఎస్ వీసీ, ఏపీ డీఎంఈ, ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం పర్యవేక్షణలో వైస్ ప్రిన్సిపాల్, అనస్థీషియాలజీ హెచ్‌వోడీ, ప్రొఫెసర్ డాక్టర్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. వైస్ ప్రిన్సిపాల్, అకడమిక్స్, అనాటమీ హెచ్‌వోడీ డాక్టర్ డీపీవీఎస్ శశి సదస్సులో ప్రసంగించారు. అంకిత భావం విలువను వెల్లడించారు. కార్యక్రమంలో బయోకెమిస్ట్రీ హెచ్‌వోడీ భాగ్యలక్ష్మి, మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ కో ఆర్డినేటర్ డాక్టర్ రాజ్యలక్ష్మి, అనాటమీ అసోసియేట్ ప్రొఫెసర్, మహిళా హాస్టల్ వార్డెన్ డాక్టర్ లలిత, బయోకెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రమోదిని, ఆర్‌ఎంసీ క్యాంపస్ ఆఫీసర్, ఫోరెన్సిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సతీష్‌లు వైద్య విద్య ప్రాధాన్యత, వ్యక్తిగత, సామాజిక అభివృద్ధి, కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరుచుకోవడం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 200 మంది విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఆర్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ విష్ణువర్ధన్ విద్యార్థుల చేత చరక సపత్ పేరుతో ప్రతిజ్ఞ చేయించారు.

ఐఎఫ్‌టీయూ సదస్సును విజయవంతం చేయండి



ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: నాలుగు లేబర్ కోడ్‌లు, మూడు నేర చట్టాల రద్దుతో పాటు కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై ఏపీలో రెండు ఐఎఫ్‌టీయూ సంఘాలు ఈనెల 18న విజయవాడలో ఉమ్మడి రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె వెంకటేశ్వర్లు తెలిపారు. సదస్సు జయప్రదం చేయాలంటూ వేసిన పోస్టర్లు, కరపత్రాలను సోమవారం సాయంత్రం ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. లేబర్‌కోడ్‌లు, నేర చట్టాలు రద్దు చేయటంతో పాటు ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ నిలిపి వేసే వరకు తమ పోరాటం సాగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం తదితర పథకాల వర్కర్లందర్నీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికునికి నెలకు రూ. 26 వేలు జీతం చెల్లించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలులోకి తెచ్చి, కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. భవన నిర్మాణ రంగ బోర్డు ద్వారా కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు కె నరసింహ, బొడ్డు సత్యనారాయణమూర్తి, పి నాగేశ్వరరావు, రాఘవ, ఎల్లారావు, రాజేష్, నూకరాజు, అనూక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరం పరిష్కరించండి

అదనపు కమిషనర్ సుధాకర్



అర్జీదారుని సమస్య తెలుసుకుంటున్న అదనపు కమిషనర్ సుధాకర్

కాకినాడ: డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని కాకినాడ నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ సుధాకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9.30 నుంచి 10.30 వరకు నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సుమారు 14 మంది ఫోన్ చేసి తమ సమస్యలను అధికారులకు వివరించారు. అనంతరం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అదనపు కమిషనర్ సుధాకర్ నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను స్వయంగా విని పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ విభాగాలకు సంబంధించి సుమారు 13 అర్జీలు అందాయి. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని ఏడీసీ సూచించారు. పరిష్కరించిన అర్జీల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ మనోహర్, ఎంహెచ్ డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ శిరీష్, టీపీఆర్వో శైలజ, మెప్మా సిటీ కమిషనర్ మేనేజర్ డి.వెంకట్రాజు, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

అలయన్స్ సేవలు విస్తృతం చేయాలి



క్లబ్ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న చప్పిడి వెంకటేశ్వరరావు

బాలాజీ చెరువు: అలయన్స్ క్లబ్ సేవలు గ్రామ స్థాయిలో అందించాలని అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ డాక్టర్ చప్పిడి వేంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్‌లో సోమవారం అలయన్స్ క్లబ్ ఆఫ్ స్వాతి హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో నూతన ఎల్‌ఎంఎఫ్ క్లబ్ సభ్యుల ప్రమాణ స్వీకరణ నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులుగా పెంకే శివకుమార్, కార్యదర్శిగా తెల్ల వీరభద్రరావు, కోశాధికారిగా వరప్రసాద్‌లతో ప్రమాణ స్వీకరణ చేయించి క్లబ్ ఆశయాలు, లక్ష్యాలు వివరించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ వనుం శ్రీనివాసరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సినిమాలు



ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్:
విశ్వం, వేట్టయాన్, దేవర, జనక అయితే గనక
దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్:
దేవర, వేట్టయాన్, మా నాన్న సూపర్ హీరో

లక్ష్మి:	దేవర
సత్యగౌరి:	మా నాన్న సూపర్ హీరో
తిరుమల:	వేట్టయాన్
సీఅండ్‌ఎస్1:	జనక అయితే గనక
సీఅండ్‌ఎస్2:	శ్వాగ్
శ్రీప్రియ:	మార్టిన్
పద్మప్రియ:	దేవర
సూర్య (వాకలపూడి):	దేవర
సూర్య2:	విశ్వం

భారతీయ వైభవానికి కూచిపూడి మణిహారం..!

ఎనిమిది ప్రధాన భారతీయ శాస్త్రీయ నృత్యాల్లో కూచిపూడి నృత్యం ఒకటి. మన రాష్ట్రంలోని కృష్ణాజిల్లా మొవ్వ మండలం కూచిపూడి గ్రామంలో ఈ నృత్యం ఆవిర్భవించింది. క్రీస్తు పూర్వం 2వ శతాబ్దంలో ఈ ప్రాంతంలోని బ్రాహ్మణులు ఈ శాస్త్రీయ నృత్యాన్ని అభ్యసించడంతో దీనికి ఈ పేరు వచ్చింది. ప్రస్తుతం ఇది దక్షిణ భారతదేశం అంతటా విస్తరించింది.

- కూచిపూడి నృత్యానికి నేటికీ ఎంతో ఆదరణ
- దేశ విదేశాల్లో కళాకారుల ప్రదర్శనలు
- నేడు కూచిపూడి నృత్య దినోత్సవం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): అప్పటిలో కేవలం దేవాలయాల్లో మాత్రమే కూచిపూడి నృత్యం ప్రదర్శించేవారు. సంప్రదాయం ప్రకారం పూర్వం బ్రాహ్మణ కులానికి చెందిన మగవారు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించేవారు. వీరిని కూచిపూడి భాగవతులుగా పిలిచేవారు. 15వ శతాబ్దంలో సిద్ధేంద్రయోగి కూచిపూడి నృత్యాన్ని అభివృద్ధి చేశారు. అతని అనుచరులైన బ్రాహ్మణులు కూచిపూడిలో స్థిరపడి ఈ నాట్యాన్ని అభ్యసించడంతో ఆ ఊరిపేరే ఈ నాట్యానికి పెట్టారు. నాట్యగురువు పద్మ భూషణ్ అవార్డు గ్రహీత వెంపటి చిన సత్యం పుట్టిన రోజును కూచిపూడి దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించింది.

కూచిపూడికి ఎంతో ప్రాచుర్యం

కాలక్రమేణా మగవారితో పాటు ఆడవాళ్లు కూడా ఈ కూచిపూడి నృత్యాన్ని నేర్చుకొని ప్రదర్శనలు ఇస్తున్నారు. అప్పటిలో కేవలం మగవాళ్లు మాత్రమే ఈ నృత్యాన్ని నేర్చుకొని ప్రదర్శనలు ఇచ్చేవారు. మగవాళ్లు ఆడవాళ్ల వేషం వేసుకొని ప్రదర్శనలు ఇచ్చేవారు. అప్పటిలో రవాణా సదుపాయం లేకపోవడంతో దూర ప్రాంతాలకు మహిళలు వెళ్లడం కుదరదు కనుక మగవాళ్లే ఈ ప్రదర్శనలు ఇచ్చేవారు. ప్రస్తుతం కూచిపూడి నృత్యం విదేశాల్లో సైతం ఎంతో ప్రాచుర్యం పొందింది. ప్రస్తుతం ఎక్కువగా ఆడవాళ్లు ఈ కూచిపూడి నృత్యం నేర్చుకొంటున్నారు. తమ పిల్లలకు కూచిపూడి నృత్యం నేర్పించేందుకు తల్లి తండ్రులు సైతం ఆసక్తి చూపుతున్నారు.



కూచిపూడి నేర్చుకొంటున్న చిన్నారులు



కాకినాడ సత్కళా వాహినిలో కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

కూచిపూడి నృత్యానికి ఆదరణ



"ఎంతో పురాతనమైనది కూచిపూడి నృత్యం. ప్రస్తుతం దీనికి ఎంతో ఆదరణ లభిస్తోంది. గతంలో కేవలం దేవాలయాల్లో మాత్రమే ఈ ప్రదర్శన ఉండేది. ప్రస్తుతం ఈ కూచిపూడి నృత్యం చూసేందుకు ప్రత్యేకంగా ప్రదర్శనలు ఏర్పాటు చేసుకొంటున్నారు. మన దేశంలోనే కాక దేశ విదేశాల్లోనూ కూచిపూడి నృత్యానికి ఎంతో ఆదరణ ఉంది. ఎంతో మందికి కూచిపూడి నేర్పించడం నా అదృష్టంగా భావిస్తున్నాను."

– ఓవీఎస్ వరప్రసాద్, నాట్యగురువు, కాకినాడ

ఎంతో మంది నేర్చుకొంటున్నారు



కూచిపూడి నాట్యం నేర్చుకొనేందుకు ఇప్పుడు ఎంతో మంది ఆసక్తి చూపుతున్నారు. కూచిపూడి నేర్చుకొంటున్నందుకు ఎంతో సంతోషిస్తున్నాను. కూచిపూడి గ్రామంలో నృత్యం నేర్చుకొని, దూరదర్శన్ గ్రేడ్ ఆర్టిస్టుగా పని చేశాను. కూచిపూడి నృత్యం ప్రపంచానికి వన్నె తెచ్చింది. కూచిపూడి లెజెండ్ డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి దగ్గర ఎంఏ చేశాను. ప్రస్తుతం నా దగ్గర సుమారు 60 మంది కూచిపూడి నృత్యం నేర్చుకొంటున్నారు.

– పి. దుర్గారావు, మంజీర నాట్యాలయం, కాకినాడ.

300 ప్రదర్శనలు ఇచ్చాను



నేను ఇప్పటి వరకూ 300 ప్రదర్శనలు ఇచ్చాను. చిన్న తనంలో పిఠాపురంలో నాట్య గురువులు పిల్లా సత్యనారాయణ వద్ద , హైదరాబాద్‌లో పద్మశ్రీ శోభానాయుడు వద్ద కూచిపూడి నృత్యం నేర్చుకున్నాను. ఎంతో మందికి కూచిపూడి విద్యను నేర్పిస్తున్నాను. నా విద్యార్థులు దేశ విదేశాల్లో ప్రదర్శనలు ఇస్తున్నారు. ఇప్పటికీ కూచిపూడి నృత్యానికి ఎంతో ఆదరణ ఉంది.

– కొత్త ప్రవీణ, కూచిపూడి శిక్షకురాలు